

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 1 డిసెంబరు 2025



తొలి విడత నామినేషన్ల పరిశీలన పూర్తి



- ఒక సర్పంచ్, 3 వార్డు సభ్యుల నామినేషన్ల తిరస్కరణ
- 92 సర్పంచ్ పదవులకు 463 మంది అభ్యర్థులు
- 866 వార్డులకు 1939 మంది అభ్యర్థులు
- రెండోవిడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- తొలి రోజు సర్పంచ్ పదవులకు 121 నామినేషన్లు
- వార్డులకు 209 నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తొలి విడతలో ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల పరిశీలన పూర్తయింది. మొదటి విడతలో ఒక సర్పంచ్, మూడు వార్డు సభ్యుల నామినేషన్లను తిరస్కరించారు.

- గంగాధర మండలంలోని మల్లాపూర్ పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ రిజర్వుడ్ కాగా ఆ గ్రామానికి చెందిన రాధ నామినేషన్ వేశారు. ఎస్సీ వర్గానికి చెందిన ఆమె ముస్లిం యువకుడిని వివాహం చేసుకుంది. రాధ ముస్లిం యువకుడిని ఆ మత ఆచారం ప్రకారం వివాహం చేసుకున్నదని, దీంతో ఆమె బీసీ కేటగిరీ కిందకు వస్తుందని ఆమె ప్రత్యర్థులు రిటర్నింగ్ అధికారికి ఆధారాలు చూపుతూ ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. ఆమె సోమవారం అప్పీలు చేసుకోనున్నట్లు సమాచారం.

- గంగాధర మండలంలోని మధురానగర్, ముప్పిడి నర్సయ్యపల్లి వార్డులలో రెండు నామినేషన్లను తిరస్కరించారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందుల్ రెండో వార్డులో అభ్యర్థి వయస్సు తక్కువగా ఉండడంతో ఒక నామినేషన్‌ను తిరస్కరించారు. ఇది మినహా మిగతా అన్ని నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు పరిశీలనలో తేలింది.

- చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామ పంచాయతీలోని సర్పంచ్ పదవితో సహా ఎనిమిది వార్డులకు సింగిల్ నామినేషన్ రావడంతో ఏకగ్రీవమయ్యింది. గంగాధర మండలంలో 66 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

- కరీంనగర్ రూరల్ మండలంలో 25 వార్డులకు సింగిల్ నామినేషన్లు వచ్చాయి. కొత్తపల్లి మండలంలోఐదువార్డులకు సింగిల్ నామినేషన్లు వచ్చాయి.

- జిల్లాలో తొలి విడతలో ఎన్నికలు జరుగుతున్న 92 గ్రామ పంచాయతీల్లో 463 మంది సర్పంచు అభ్యర్థులు బరి లో ఉన్నారు. 866 వార్డులకు 1,939 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నామినేషన్లపై అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు చేసుకోవచ్చు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు అభ్యంత రాలుంటే పరిష్కరిస్తారు. నామినేషన్లు వేసిన వారు అభ్యర్థి త్వాన్ని ఉపసంహరించుకోవడానికి డిసెంబరు 3న మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతిస్తారు. ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబరు 11న తొలి విడత ఎన్నికలు జరుగుతాయి. అదేరోజు ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

● ఓ వైపు ఉపసంహరణకు యత్నాలు... మరోవైపు ప్రచారం

మొదటి విడత జరిగే పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన (మిగతా 8వ పేజీలో)

● రెండో విడతలో 113 గ్రామాల్లో ఎన్నికలు

డిసెంబరు 14న ఎన్నికలు జరిగే చిగురుమామిడి, గన్నేరువరం, మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్ మండలాల్లోని 113 గ్రామపంచాయతీలకు చెందిన 113 సర్పంచ్ పదవులు, 1,046 వార్డు సభ్యులకు నామినేషన్ల స్వీకరణ ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజు 113 సర్పంచ్ పదవులకు 121 నామినేషన్లు, 1046 వార్డులకు 209 నామినేషన్లు వచ్చాయి. చిగురుమామిడి మండలంలో సర్పంచ్ పదవులకు 16 మంది, వార్డు సభ్యులకు 32 మంది నామినేషన్లు వేశారు. మానకొండూర్ మండలంలో సర్పంచ్ పదవులకు 30, వార్డు పదవులకు 65 మంది, శంకరపట్నం మండలంలో 35 మంది సర్పంచ్ పదవులకు, 50 మంది వార్డు పదవులకు నామినేషన్ దాఖలు చేశారు. గన్నేరువరం మండలంలో 10 మంది సర్పంచ్ పదవులకు, 17 మంది వార్డు పదవులకు, తిమ్మాపూర్ మండలంలో 30 మంది సర్పంచ్ పదవులకు, 45 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు వేశారు. డిసెంబరు 2 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 3న నామినేషన్లను పరిశీలిస్తారు.

కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు

- జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య



బాల వైజ్ఞానిక మేళాలో ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈవో శ్రీరాం మొండయ్య

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య అన్నారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహిస్తున్న బాల వైజ్ఞానిక మేళాను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలను నిశితంగా పరిశీలించాలన్నారు. సమాజంలోని సమస్యలను గుర్తించడం ద్వారా వాటికి పరిష్కార మార్గాలను కనుగొనేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యాబోధన ప్రణాళికల్లో శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి వైజ్ఞానిక మేళాకు విశేష స్పందన లభిస్తున్నదన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 2,652 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్ భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, కొత్తపల్లి, గంగాధర, సైదాపూర్, గన్నేరు వరం ఎంఈవోలు తుమ్మ ఆనందం, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, కట్ట రవీంద్రా చారి, రామయ్య, గాజుల రవీందర్, స్తంభంకాడి గంగాధర్ పాల్గొన్నారు.

కరీంనగర్ కళాకృతులను ప్రపంచానికి చాటిన ప్రధాని

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫిలిగ్రీ వర్క్స్, వెండి కళాకృతులను దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి పరిచయం చేయడం సంతోషకరమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ కరీంనగర్ కళాకృతుల గురించి ప్రస్తావించారన్నారు. కరీంనగర్ వెండి సాంప్రదాయ కళాకృతుల (ఫిలిగ్రి వర్క్స్)ను ప్రధాని ఎంతగానో ప్రోత్సహించారన్నారు. జి 20 దేశాల సమావేశాల సందర్భంగా కరీంనగర్‌లో తయారైన సాంప్రదాయ కళాకృతులను ప్రధాని మోదీ వివిధ దేశాలకు చెందిన ప్రధాన మంత్రులకు బహుకరించిన విషయాన్ని గుర్తు చేశారన్నారు. కరీంనగర్‌లో తయారైన సాంప్రదాయ కళాకృతులు, వెండితో తయారైన బుద్ధుడి ప్రతిమను జపాన్ ప్రధానికి, పూల ఆకృతితో ఉన్న సిల్వర్ మిర్రర్‌ను ఇటలీ ప్రధానికి బహుకరించిన విషయాన్ని ప్రధాని మోదీ మన్‌కీ బాత్ సందర్భంగా ప్రస్తావించడం హర్షణీయమన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



కరపత్రాలను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి విమర్శించారు. నగరంలోని 17వ డివిజన్ విద్యానగర్‌లో కాంగ్రెస్ అమలు చేయని హామీల కరపత్రాలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు బండ రాకేష్, చంద్రగిరి వేణు, శీతల రమేష్‌చంద్ర, మొగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేకుర్తి కంటి ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్సలు

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో ఈ నెల 2వ తేదీ మంగళవారం ప్రత్యేక కంటి వైద్యులు అందుబాటులో ఉంటారని ఆసుపత్రి చైర్మన్ కొండావేణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మెల్ల కన్ను చికిత్స కంటి కాన్సర్ ఓక్యులోప్లాస్టీ చికిత్స కోసం ప్రత్యేక నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. అవసరమైన వారు ఆసుపత్రికి వచ్చి చికిత్స పొంద వచ్చన్నారు. వివరాలకు 7673983940, 9652198826 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రజావాణి రద్దు

సుభాష్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామ న్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. స్థానిక సం స్థల ఎన్నికలు ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత యాథావిధిగా కొనసాగిస్తామన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయిని సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌లోని తిరుమల హోమ్స్ ఏరియాలో ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నారు. పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసిన యువకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. ఒకరు పారిపోయారు. వారి వద్ద తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి దొరికింది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం, జయ్యారం గ్రామానికి చెందిన కోరండ్ల రఘువర్దన్‌రెడ్డి, అదే గ్రామానికి చింతకింద శ్రీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రఘువర్దన్‌రెడ్డి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ తిరుమల హోమ్స్‌లో గది అద్దెకు తీసుకుని శ్రీకృష్ణతోపాటు ఉంటున్నాడు. శ్రీకృష్ణ తిమ్మాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. కొంతకాలంగా వీరు తిమ్మాపూర్‌లోని ఒక హాస్టల్‌లో ఉంటున్న యువకుడి వద్ద గంజాయి కొనుక్కుని సేవిస్తున్నారు. వీరికి గంజాయి ఇచ్చిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి 110 గ్రాముల గంజాయితోపాటు ఒక మొబైల్, రెండు గంజాయి తాగే భంగ్ డబ్బాలను, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తిమ్మాపూర్ హాస్టల్స్‌లో ఉంటున్న చాలా మంది విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారని తమకు సమాచారం వచ్చిందని ఎస్సై చెప్పారు. గంజాయి సేవించినా, అమ్మినా నేరమన్నారు. గంజాయికి అలవాటు పడి జీవితం పాడు చేసుకోవద్దని ఎస్సై తెలిపారు. ఆయా హాస్టల్స్‌కు సంబందించిన యజమానులు విద్యార్థులపై నిఘా పెట్టాన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- నగునూర్ వద్ద ఘటన
6

సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయం ఏర్పాటు
8

కరీంనగర్‌కు చేరుకున్న మహాపాదయాత్ర బృందం
8

అక్రమ ఇసుక రవాణాకు తెర తీసింది బీఆర్ఎస్ పార్టీనే

- పాత వీడియోలు చూపించి చెక్‌డ్యామ్ పేల్చారని అంటున్నారు..
- పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి

జమ్మికుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణాకు తెర తీసింది బీఆర్ఎస్ పార్టీనే అని పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇసుక వ్యాపారం సాగడం లేదన్నారు. ప్రజలను బ్లాక్ మెయిల్ చేసి గెలిచిన హుజూరాబాద్ ఎమ్మెల్యే మాటలు విని మాజీ మంత్రులు ఇక్కడకు రావడం బాధకరమన్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణానికి స్టీల్ వాడలేదని, పక్కా నాసిరకంగా కట్టారని, గతంలో ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారని తెలిపారు. ఎక్కడివో పాత వీడియోలు చూపించి చెక్‌డ్యామ్‌ను పేల్చి వేశారని పదేపదే చెప్పినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి

ప్రాంతంలో ఇసుక క్వారీలే లేవని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిత్యం వందలాది లారీలతో ఇసుకను తరలించారని విమర్శించారు. లారీల రాకపోకలతో పంట పొలాలు, రోడ్లు ధ్వంసమయ్యాయని గుర్తు చేశారు. గ్రామాల ప్రజలు అడ్డుకున్నా బెదిరించి ఇసుక అక్రమ వ్యాపారం సాగించారన్నారు. కాంగ్రెస్ రెండు రోజుల్లో ఎస్ఎఫ్ఎల్ రిపోర్ట్ వస్తుందని, వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సుంకరి రమేష్, ఎర్రం సతీష్‌రెడ్డి, ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, పూదరి రేణుక-శివకుమార్, ఇంగిలె రామరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండగట్టు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మారిన 35 కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంలో 35 దుకాణాలు పూర్తిగా కాలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబాలు రోడ్డునపడి రోదిస్తున్నాయన్నారు. ఈసంఘటన బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

● సుభాష్‌నగర్: కొండగట్టులో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అగ్నిప్రమాదంలో చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని, దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. వారి పిల్లలకు సంబంచిన స్టడీ సర్టిఫికెట్లు కూడా పూర్తి కాలిబూడిదైనట్లు తెలిపారు. విద్యా శాఖ అధికారి విచారణ జరిపి బాధిత విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. బాధితులకు వెంటనే నివాస గృహాలు ఏర్పాటు చేయాలని, వారు కోలు కునేం తవరకు ప్రభుత్వం నిత్యావసరవస్తువులను అందించాలన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

చిగురుమామిడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎన్నికల పరిశీలకుడు వి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మనపల్లిలో నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంబంధించి కట్టు దిట్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆఆయన వెంట మండల అధికారులు, ఎస్సై సాయికృష్ణ ఉన్నారు.

● తిమ్మాపూర్: గ్రామ పంచాయితీ రెండవ విడత నామినేషన్ల భాగంగా మొదటిరోజు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుండగా మండలంలోని కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా ఉన్నారు.

కవిత్వంలో నవ్యత, వైవిధ్యం అవసరం

- డాక్టర్ నాళేశ్వరం శంకరం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):కవిత్వంలో నవ్యతతోపాటు వస్తు వైవిధ్యత అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు.

భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో గొర్రె శ్యామల రచించిన 'అక్షరమా నీకు వందనం', 'అనుభవం నేర్పిన పాఠం' పుస్తకాలను ఆయన ఆదివారం ఆవిష్కరిం చారు. అనంతరం మాట్లాడుతూ ఎవరూ స్పృశించని అంశాలను కవిత్వంగా మలచాల న్నారు. దళితులు, స్త్రీలు, పర్యావరణం, ప్రకృతి వంటి సామాజికాంశాలపై మంచి కవిత్వాన్ని శ్యామల అందించారని తెలిపారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయాచార్యుడు డాక్టర్ తన్నీరు సురేశ్, విశ్రాంత ప్రిన్సిపాల్ అన్నాడి గజేందర్‌రెడ్డి మాట్లాడారు. కాసనగొట్టు స్వప్నకృష్ణ, బుర్ర విజయలక్ష్మి నాగరాజ్ పుస్తకాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో వైరాగ్యం ప్రభాకర్ , ఇటిక్యాల రాము, పలువురు కవులు, రచయితలు, రచయిత్రులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, సాహితీవేత్తలు

బీసీల ధర్మ యుద్ధభేరీలో పాల్గొన్న జిల్లా నాయకులు

గణేశ్‌నగర్,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న బీసీల ధర్మ యుద్ధభేరి కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బీసీలను అడ్డుపెట్టుకుని ఓట్లతో గెలిచి రాజకీయంగా ఎదిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 3న హుస్నాబాద్ పర్యటనకు వస్తున్నారన్నారు. ఆయనను కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల బీసీ సంఘం నేతలు, ప్రధాన రాజకీయ పార్టీలతో అడ్డుకుంటామని తెలిపారు. బహిరంగ సభలో ప్లకార్డులతో నిరసన తెలుపుతామన్నారు. డిసెంబరు 3న కరీంనగర్ డీసీసీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపపుతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్‌తో ఆమోదింప చేసి, అఖిలపక్ష నేతలతో వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను రోడ్లపై తిరగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, నారోజు రాకేష్ చారి, రాజకుమార్, ఆశిష్‌గౌడ్ పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్, మొగ్దుంపూర్ గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మానేరు వాగు నుంచి ఇసుకను దొంగలించి కరీంనగర్‌లో విక్రయించేందుకు ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు అలవేని అనిల్, దాసరి నరేష్, గాజుల శివకృష్ణ, శ్రీరామోజు తిరుపతిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.

లభ్యంకాని మృతుడి వివరాలు

జమ్మికుంట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునపల్లి శివారులో లభించిన గుర్తు తెలియని యువకుడి మృతదేహం వివరాలు తెలియరాలేదు. క్లూస్ టీం మృతుడి శరీర భాగాల నుంచి శాంపిల్స్ సేకరించింది. డాగ్ స్క్వాడ్ మృతదేహం పడి ఉన్న ప్రాంతం మొత్తం తిరిగింది. హంతకులు మద్యం తాగిన ఆనవాళ్లు తప్ప మిగతా క్లూ వదిలిపెట్టలేదు. అన్ని పోలీస్ స్టేషన్లకు మృతుడి ఫొటోలు, వివరాలు పంపించినా ఫలితం లేదు. శంభునిపల్లికి గుంపుల క్రాస్ రోడ్, వావిలాల, తనుగుల గ్రామాల మీదుగా రాకపోకలు తప్ప ఇతర మార్గాలు లేవు. దీంతో పోలీసులు మూడు ప్రధాన రోడ్ల గుండా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. హంతకులు సెల్‌ఫోన్లు కూడా వెంట తెచ్చుకోనట్లు సమాచారం.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

రేషన్‌బియ్యం కోసం ఆదివాసీల తిప్పలు



- చిన్నకొల్వాయిలో రేషన్‌షాపు లేక నాలుగు కిలోమీటర్ల నడక
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చిన్నకొల్వాయి గ్రామం

బీర్‌పూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆదివాసీల పరిస్థితులు మాత్రం మారడం లేదు. బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి గ్రామంలో రేషన్‌దుకాణం లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నకొల్వాయి ఒకప్పుడు కొల్వాయికి అనుబంధ గ్రామంగా ఉండగా ప్రస్తుతం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 50 కుటుంబాలు ఉండగా 200 జనాభా ఉంది. వీరు ప్రతి నెల ప్రభుత్వం చౌకధరల దుకాణం ద్వారా అందించే బియ్యం కోసం సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన కొల్వాయి గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. నాలుగు కిలోమీటర్లు నడవడమే కష్టం కాగా బియ్యాన్ని మోసుకొని పోవడం మరి ఇబ్బంది అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి

-మాజీ సర్పంచ్ చిక్రం రవీందర్, చిన్నకొల్వాయి



మా గ్రామంలో ప్రత్యేక రేషన్ షాప్ ఏర్పాటు చేసి అంద రికీ రేషన్‌బియ్యం పంపిణీ చేయాలి. ఈ విషయ మై అనేక సార్లు అధికారులు, నాయ కుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ మా బాధలను పట్టించుకోవడం లేదు. ప్రతి నెల నాలుగు కిలోమీటర్ల దూరం నడి చి వెళ్లి రేషన్‌బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది.

బియ్యం కోసం ఇబ్బంది పడుతున్నాం

-కొట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



మేము నాలుగు కిలోమీటర్ల దూరం మేము నడవడమే కష్టంగా ఉంది. ఇంకా మా బియ్యాన్ని ఎలా మోసుకొని పోతాము. పెద్ద సార్లు మా గోస చూసి మా గూడెంలో రేషన్‌దుకాణం పెట్టి బియ్యం తీసుకునేటట్టు చేయాలి

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి

మంథనిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరెంద వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పంచిక సదయ్య (40) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. వెంకటాపూర్ గ్రామానికి చెంది న సదయ్యకు మల్లన్న బోనాలు ఉండటంతో బంధువులతో కలిసి గోదావరి నది స్నానానికి వెళ్లాడు. స్నానం చేసిన అనంతరం ఇసుక కోసం తిరిగి గోదావరి నదిలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. అతని వెంట వెళ్లిన బంధువులు అతని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గోదావరి నదిలో గల్లంతయిన సదయ్య కోసం సుమారు రెండు గంటల పాటు గాలించిన అనంతరం మృతదేహాన్ని గ్రామస్థులు వెలికితీశారు. సదయ్యకు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్‌కు చెందిన నిమ్మటూరి సాయికృష్ణ, అతని భార్య రమతో కలిసి హుజూరాబాద్ నుంచి కరీంపేటకు వెళ్తున్నాడు. కరీంపేట నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సాయికృష్ణ చేతికి, పక్కటెముకలకు గాయాలయ్యాయి. అతని భార్య కుడికాలుకు గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ కిందపడి యువకుడి మృతి

గంగాధర(రామడుగు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామడుగు మండల కేంద్రంలో టిప్పర్ వెనక టైర్లు మీదనుంచి వెళ్లగా ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి వెంకటేష్(39) అనే యువకుడు తన టిప్పర్ బ్రేక్ డౌన్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి మరమ్మతులు చేస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్ తమ్ముడు మామిడి నరేష్ టిప్పర్‌ను ముందుకు నడిపించాడు. ఈక్రమంలో టిప్పర్ వెనక టైర్లు వెంకటేశ్‌పై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకటేష్ తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డునపడిన బతుకులు..

- కొండగట్టు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి.. - కట్టుబట్టలతో బాధితులు - రూ.కోటికిపైగా నష్టం



రోదిస్తున్న బాధితులు

వారంతా బొమ్మలు అమ్ముకొని జీవించే సామాన్యులు.. సమ్మక్కసారక్క జాతర రానుండడంతో కొండగట్టుకు భక్తుల రాక ఎక్కువగా ఉంటుందని, తమ వ్యాపారం కాస్తా కలిసివస్తుందని.. అప్పులు చేసి లక్షల రూపాయల విలువైన బొమ్మలు, ఆట వస్తువులు, పూజాసామగ్రి తెచ్చుకున్నారు. దుకాణం అంతా నింపుకోగా శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. వస్తువులతో పాటు ఇంటి సామగ్రి సర్వం బుగ్గి అయ్యింది. బాధిత కుటుంబాలు రోడ్డునపడి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మల్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కొండగట్టులోని అభయాంజనేయస్వామి విగ్రహం ముందు గల దారికి ఇరువైపుల ప్రైవేట్ వ్యక్తుల వద్ద అనేక మంది స్థలం అద్దెకు తీసుకొని అనేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. శనివారం రాత్రి సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద నుంచి వెళ్లిన తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురికావడంతో మొదట అక్కడ గల ఒక్క దానికి మంటలు వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే ఇరవైకి పైగా దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి. అందులో ప్లాస్టిక్ వస్తువులే అధికంగా ఉండడంతో మంటలు దట్టంగా చెలరేగాయి. దీంతో దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీయగా కళ్లెదుటే సర్వం బుగ్గి కావడంతో వారి రోదనలు మిన్నంటాయి.

● ఆలస్యంగా వచ్చిన ఫైర్ ఇంజన్..

ప్రమాదం జరిగిన వెంటనే జగిత్యాలలోని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా సుమారు గంటన్నర వరకు రాలేదని బాధితులు తెలిపారు. సమాచారం అందించినప్పుడు కేవలం మూడు దుకాణాలకు మాత్రమే మంటలు వ్యాపించాయన్నారు. ఫైరింజన్ వచ్చే వరకు మొత్తం ఇరవైకి పైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలకు చెందిన ఇంటి సామగ్రి, కుట్టు మిషన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, బీరువాలు, బంగారం, నగదు తదితర వస్తువులు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఫైర్ ఇంజన్ సకాలంలో చేరుకుంటే ఇంత నష్టం జరిగేది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం..

అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తోనే జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇనుప రేకులు చిల్లుల పడగా తీగలు ముద్ద అయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో వరంగల్ సీఈ అశోక్ పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా అగ్నిప్రమాదంలో కోటి నుంచి రెండు కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొంటున్నారు. జాతర కోసం ఇటీవలే సామగ్రి తీసుకు వచ్చామని ఇంతలోనే ప్రమాదం జరగడం తీరని వేదన మిగిల్చిందని బాధితులు అంటున్నారు.

● సర్టిఫికెట్లు బుగ్గి..

అగ్నిప్రమాదంలో కరీంనగర్‌లో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న శ్వేత అనే విద్యార్థినికి చెందిన సర్టిఫికెట్లు కాలిపోయాయి. అలాగే అగ్నిప్రమాద వేడితో సమీపంలో గల దుకాణంలో గల అనిల్ అనే వ్యక్తికి చెందిన నలభై కోళ్లు బుగ్గి అయ్యాయి. అలాగే ఓ ఇళ్లు మంటలతో నల్లగా మారగా సమీప ఇళ్లల్లో వస్తువులు వేడికి చెడిపోయాయి. రెవెన్యూ అధికారులు నష్టం అంచనా వేస్తున్నారు.

● బాధితులకు ఆర్థికసాయం..

అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన అనేక కుటుంబాలకు కట్టు బట్టలే మిగిలాయి. బాధిత కుటుంబాలను ప్రస్తుతం అధికారులు సమీపంలో గల శ్రీనాథ్ రెసిడెన్సీలో బస కల్పించారు. రెవెన్యూ అధికారులు ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5వేల నగదు, 10కిలోల బియ్యం అందించారు. మరో రూ.15వేల సాయం సోమవారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కొండగట్టులో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ప్రమాద సంఘటన స్థలాన్ని మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాద ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వారందరిని ఓదార్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ సంఘటన బాధకరం అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరామని, ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని, అధైర్యపడవద్దని మంత్రి తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.20వేలతో పాటు సెర్ప్ ద్వారా వడ్డీ లేని రూ.5లక్షల వరకు రుణాలు అందించాలని అధికారులకు సూచిస్తామని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా జరిగిన ప్రమాదం కాబట్టి విద్యుత్ శాఖ లక్ష రూపాయలు అందిస్తే చిరు వ్యాపారులంతా మళ్లీ షెడ్లు వేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడతూ బాధితులను పూర్తిగా ఆదుకుంటామన్నారు. వారి వెంట మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి ఉన్నారు.

● బీఆర్ఎస్ ఆర్థిక సహాయం

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ తరుపున మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.5వేలు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.30లక్షలు పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు ఉన్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీసి రవిశంకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● మంత్రి పొన్నం, కవిత విచారం

కొండగట్టు అగ్నిప్రమాదం ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్, జాగృతి అధ్యక్షురాలు కవిత విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆదుకోవాలని కోరినట్లు మంత్రి పేర్కొన్నారు. చిరు వ్యాపారుల దుకాణాలు బుగ్గి అయి సర్వం కోల్పోవడం తన మనసు కలచివేసిందని కవిత ఒక ప్రకటనలో అన్నారు. మానవత దృక్పతంతో ప్రభుత్వం ఆదుకోవాలని కవిత కోరారు.

● పెళ్లికి సిద్ధం చేసుకున్న బంగారం

పెళ్లికి సిద్ధం చేసుకున్న బంగారం అగ్నిప్రమాదంలో బుగ్గి అయినట్లు ఓ వ్యక్తి మంత్రి లక్ష్మణ్‌తో పేర్కొనడం అక్కడి వారందరిని కలచివేసింది. ఒక్కొక్కరూ తమ బాధలను చెబుతుంటే మంత్రి, ఎమ్మెల్యేలు చలించిపోయారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కొండగట్టులో జరిగిన అగ్నిప్రమాద ఘటన ప్రాంతాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పూర్తి నివేదిక అందించాలని తహసీల్దార్, ఇతర అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో 25 దుకాణాలు పూర్తిగా, ఐదు దుకాణాలు పాక్షికంగా దగ్ధం అయినట్లు అధికారులు తెలిపారు. వారికి రూ.ఐదువేల చొప్పున సాయం అందించారు. ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ఆమని, ఆర్ఐ తిరుపతి, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.





బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఘటనాస్థలాన్ని కలెక్టర్ సత్యప్రసాద్, బాధితులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

దారి దోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి డీసీఎం డ్రైవర్ వద్ద నుంచి రూ. 22వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన నిందితుల ముఠాను అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటపూర్‌కు చెందిన తాళ్లపల్లి నవీన్ అనే వ్యక్తి తన సొంత డీసీఎం వ్యాన్‌లో వడ్ల లోడ్‌ను నిజామాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ వడ్ల లోడ్‌ను దింపి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద శనివారం అర్ధరాత్రి కాలకృత్యాల కోసం డీసీఎం వాహనాన్ని నిలిపాడు.

అదే సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన జగిత్యాల పట్టణంలోని పెరకపల్లి రోడ్‌కు చెందిన ఎర్రం సాయి, గాంధీ నగర్‌కు చెందిన నక్క గణేష్‌తో పాటు మరో బాలుడు వాహన డ్రైవర్ నవీన్‌పై కర్రలతో దాడి చేశారు. అతడి వద్ద ఉన్న రూ. 22 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి పారిపోయారు. నవీన్ ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ పోలీసు లు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం పెరకపల్లి రోడ్డు వద్ద నిందితు లను పట్టుకుని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. దొంగతనం జరిగిన 24 గంటల్లో నిందితు లను అరెస్టు చేసిన జగిత్యాల సీఐ కరుణా కర్, స్పెషల్ పార్టీ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన సమ్మయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. 6,100 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

వీణవంక: మండలంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శ్రీరాములపేటకి చెందిన కురిమిండ్ల రవీందర్ ఏడు వేల రూపాయల విలువైన మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గంభీరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామ చెరువు ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అదే గ్రామంలోని రైతు గంద్యాడపు శంకర్‌కు చెందిన పాడి గేదె ఆదివారం మృత్యువాత పడింది. శంకర్ తన వ్యవసాయ పొలం వద్ద పాడి గేదెను కట్టేశాడు. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తెడి పడడంతో పాడిగేదె మృత్యువాత పడింది. సుమారు రూ.50వేల విలువ ఉంటుందని బాధిత రైతు శంకర్ పేర్కొన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

భక్తజన సంద్రమైన మల్లన్నపేట

- మల్లన్నకు బోనాలు సమర్పణ



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలకు భక్తులు భారీ ఎత్తున తరలి రావడంతో మల్లన్నపేట గ్రామంలోని వీదులన్ని వేలాదిగా తరలివచ్చిన భక్త జనంతో కిటకిటలాడాయి. ఏటా మార్గశిర మాసంలో వచ్చే షష్ఠి ఉత్సవాలలో ఏడు వారాల పాటు మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఏడు వారాల పాటు ఉత్సవాలు జరుగుతాయి. షష్ఠి ఉత్సవాలలో మొదటి ఆదివారం కావడంతో పాటు సెలవు దినం కావడంతో మల్లన్న జాతరకు భక్తులు అదిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి శ్రీ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ స్వామి వారికి వివిధ సేవా టికెట్ల ద్వారా లక్షా నాలుగువేల 5 వందల 40 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహనాదికారి విక్రమ్ తెలిపారు. జాతరకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో ధర్మపురి సిఐ రాంనర్సింహ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసు బృందం బారీ బందోబస్తు నిర్వహించింది. వైద్య సిబ్బంది భక్తులకు కావాల్సిన వైద్యం చేశారు. పంచాయతీ రాజ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆలయ ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య, దేవాదాయ శాఖ సిబ్బంది, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు భక్తుల సేవలో తరించారు. ఎస్సైలు ఎం కృష్ణ, సాగర్ రెడ్డి, ఉదయ్ కుమార్, మహేష్, రవీందర్, సుప్రియ లు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- నగునూర్ వద్ద ఘటన




దూడం రఘురాం(ఫైల్), కొమ్మిడి దేవేందర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరిని కబలించగా మరో ఇద్దరు చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కరీంనగర్ శివారులోని నగునూర్- జూబ్లీనగర్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నగునూర్ గ్రామస్థులు, కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన రైతు కొమ్మిడి దేవేందర్‌రెడ్డి(55), ఆయన భార్య హైమావతి కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ లోని వారి కూతురు ఇంట్లో జరిగిన మల్లన్న పట్నాల(పండుగ)కు హాజరై స్వగ్రామానికి ద్విచక్రవాహనం(టీఎస్ 22 ఇ 7746)పై బయల్దేరారు. రాత్రి 7:30 గంటల సమయంలో కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దూడం రఘురాం(31), తుంటి రమేష్ ద్విచక్రవాహనం(టీఎస్ 02ఈఫ 6487)పై నగునూర్ వైపునకు వస్తున్నారు. నగునూర్ పరిధిలోని ఓ వైద్య కళాశాల సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనాలపై ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో చొప్పదండి ఐకేపీ నుంచి ధాన్యం లోడ్‌తో కరీంనగర్‌కు వస్తున్న లారీ(ఏపీ 25 వీ 9888) అప్పటికే ద్విచక్రవాహనాలు ఢీకొని రోడ్డుపై పడిపోయిన నలుగురి పైనుంచి దూసుకెళ్లింది. ప్రమాదంలో కొమ్మిడి దేవేందర్‌రెడ్డి, దూడం రఘురాం మృతి చెందగా తొంటి రమేష్, దేవేందర్‌రెడ్డి భార్య హైమావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. అయితే ద్విచక్రవాహనం లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లుగా సమాచారం.

● రెండు గ్రామాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంతో సాంబయ్యపల్లి, చామనపల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. పండుగకు అల్లుడి ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా రైతు కొమ్మిడి దేవేందర్‌రెడ్డి మృతిచెందగా ఆయన భార్య హైమావతికి తీవ్రగాయాలవడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతున్నది. చామనపల్లికి చెందిన దూడెం రఘురాం కరీంనగర్‌లో ఓ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రఘురాం మరణించగా ఆయనతోపాటు ద్విచక్ర వాహనంపై ఉన్న స్నేహితుడైన రైతు తొంటి రమేష్‌కు తీవ్రగాయాలవగా వారి కుటుంబాలు రోదిస్తున్నాయి. రోడ్డు ప్రమాద ఘటన తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

నాడు కొడుకు.. నేడు తండ్రి..

కరీంనగర్ క్రైం/సుల్తానాబాద్: కన్న కొడుకు ఐదు సంవత్సరాల కిందటే మరణించగా... ఇప్పుడు తండ్రి మరణించడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. నగునూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన దేవేందర్‌రెడ్డి, హైమావతి దంపతులకు కొడుకు, కూతురు ఉండగా ఐదేళ్ల కిందట కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన దేవేందర్‌రెడ్డి కుటుంబం ఇంకా తేరుకోకముందే దేవేందర్‌రెడ్డి ప్రాణాలను రోడ్డు ప్రమాదం కబళించింది. మరో వైపున హైమావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలైంది. ఆమె కూతురు, అల్లుడు రోదిస్తుండడం అందరిని కంటతడిపెట్టిస్తున్నది. ఆదివారం ఉదయం సాంబయ్యపల్లి నుంచి కూతురు వద్దకు వచ్చిన దేవేందర్‌రెడ్డి దంపతులను సోమవారం వెళ్లాలని చెప్పినా ఇంటి వద్ద ఆయన తల్లి ఒకరే ఉందంటూ బయల్దేరారని, పావు గంటకే ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందని అల్లుడు మహేందర్, కూతురు రోదించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీడీ

రాయికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోపారపు అనూష, ఎండీ సనా రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పొరండ్ల కిరణ్, పీడీ కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లాలోని హాలియాలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనన్నున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

దత్తాత్రేయ నవరాత్రోత్సవాల్లో ఘనంగా పూజలు


దత్తాత్రేయస్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదట రామలింగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల దత్తాత్రేయస్వామి ఆలయాల్లో స్వామి వారలకు పూలతో అలకంరణ చేశారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్యనరేం దర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పురోహితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశీయ విత్తన ఉత్పత్తికి బీజం


ఏపుగా పెరిగిన దేశీయ వరి వంగడం

సాగు చేసిన దేశీయ వరి విత్తనాలు

సేంద్రియ ఎరువులతో మేలు రకం విత్తనాల ఉత్పత్తి

రామగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు, వాతావరణ కాలుష్యంతో నేలసారం తగ్గిపోతోంది. ఈ క్రమంలో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాడు. అలాగే మేలు రకమైన విత్తనాలను రైతులకు అందిస్తున్నాడు.

● సాగు చేసిన ప్రత్యేక దేశీయ వరి వంగడాలు

కులాకర్: గర్భిణులకు సుఖ ప్రసవానికి ఉపయోగపడుతుంది.

పుంగార్: బాలింతలకు అధిక పాలవృద్ధికి దోహదపడుతుంది.

మపిలై సాంబా: యుక్త వయస్సు వారికి వీర్య వృద్ధికి తోడ్పడుతుంది.

నవారా: మధుమేహ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నియంత్రణకు, నివారణకు ఉపయుక్తంగా ఉంటుంది.

బ్లాక్‌రైస్: అన్ని రకాల నల్లబియ్యం రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి

శ్రీనివాస్‌కు వ్యవసాయంపై ఉన్న మక్కువ అతడిని వ్యవసాయ విద్య వైపు మళ్లించింది. జగిత్యాలలోని పొలాసలో డిప్లొమా కోర్సు పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ అధికారిగా 2011లో ఉద్యోగం సాధించాడు. 2016 నుంచి మేలు రకం విత్తనాలను సేకరించడం ప్రారంభించాడు.

ఖాళీ సమయాల్లో వ్యవసాయ క్షేత్రంలో దేశీయ విధా నంలో వరిసాగు చేపట్టాడు. రెండెకరాల్లో దేశవాళీ విత్తనోత్పత్తి ప్రారంభించి ప్రశంసలందు కున్నాడు. సుభాస్ పాలేకర్ స్ఫూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానం శ్రీనివాస్‌ను ఆకర్షించింది. దేశీయ వరి రకాల ఉత్పత్తికి కృషి చేసినందుకు రైతునేస్తం ఫౌండేషన్ ఉత్తమ రైతు అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వ ర్యంలో తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కర్షక రత్న అవార్డును అందుకున్నారు. ఇటీవల సర్వేజనా సుఖినోభవంతు ఎన్‌జీవో హైదరాబాద్ వారు సేవా స్వర్ణనంది పురస్కారం లభించింది. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఇన్ సర్వీస్‌లో అగ్రికల్చర్ బీఎస్‌సీ విద్యను అభ్యసిస్తున్నాడు.

● ప్యాడీ ఆర్టిస్ట్‌గానూ...

దేశవాళీ వరి విత్తనాలతో ప్యాడీ ఆర్ట్ విధానాన్ని శ్రీనివాస్ అనుసరించారు. నల్లని వరిని వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం ప్యాడీ ఆర్ట్‌గా ప్రాచుర్యం పొందుతున్నాయి. జపాన్‌వంటి దేశాల్లో పాడి ఆర్ట్ పేరున ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీన్ని అధ్యయనం చేసి పొలంలో కాలాబట్టి వరి విత్తనంతో గోమాత, అయోధ్య రామమందిరం ఆకారంలో సాగు చేసి శ్రీనివాస్ ప్రత్యేకతను చాటుకున్నాడు.. గత సంవత్సరంలో భారతదేశ పటాన్ని 29 రాష్ట్రాలను తీర్చిదిద్దాడు.

బాల రచయిత సమ్మేళనంలో విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాల రచయిత సమ్మేళనంలో ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నేవూరి మీనాక్షి, దివ్యజ్యోతి పాల్గొన్నారని హెచ్ఎం మనోహరాచారి ఆదివారం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో మొత్తం 101 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనంలో పద్య రచన విభాగంలో విద్యార్థినులు మీనాక్షి, దివ్యజ్యోతి పాల్గొన్నారని చెప్పారు.

ప్రమోషన్లలో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ ఈ గ్రూప్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో 4శాతం రిజర్వేషన్లను అమలుచేయాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా అన్నిరంగాల్లో వెనుకబడిన ముస్లింలను విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేయడం జరిగిందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకొని బీసీ ఈ గ్రూపులో కొనసాగుతున్న వారిని ప్రమోషన్లలో, రిజర్వేషన్లను అమలు చేయడానికి కృషి చేయాలన్నారు.

'పంచాయతీ' పోరుకు 'సహకార' నాయకులూ అర్హులే

కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకావడంతో పల్లెల్లో రోజురోజుకు రాజకీయ వేడి రాజుకుంటోంది. 2023 జనవరి 31న గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియగా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఔత్సాహిక అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఈసారి సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు తీవ్రపోటీ నెలకొంది. మొదటి విడత నామినేషన్ల సంఖ్య భారీగా పెరుగడమే ఇందుకు నిదర్శనం. 'పంచాయతీ' ఎన్నికల్లో పోటీచేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ పోటీకి తాము అర్హులమో కాదో తెలియక చాలా గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సింగిల్ విండో) చైర్మన్లు, డైరెక్టర్లు, మత్స్య సహకార, గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలు, సహకార బ్యాంకుల చైర్మన్లు, డైరెక్టర్లు అయోమయానికి గురవుతున్నారు. నిబంధనల ప్రకారం వారందరూ పోటీ చేసేందుకు అర్హులే.

● 15 రోజుల్లోగా రాజీనామా చేయాలి

సర్పంచ్‌గా గెలిస్తే 15 రోజుల్లో సహకార సంఘాల చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. లేకపోతే సహకారశాఖ అధికారులే వారి పదవిని రద్దు చేస్తారు. చైర్మన్లు కాకుండా డైరెక్టర్లుగా ఉన్నవారు సర్పంచ్, వార్డుసభ్యులుగా కొనసాగే అవకాశం ఉంటుందని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్, సహకార సంఘం చైర్మన్ రెండు పదవుల్లో కొనసాగే వీలుండదన్నారు.

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- బీడీ కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథం

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీడీ కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ కాశీవిశ్వనాథం డిమాండ్ చేశారు. వేములవాడలో ఆదివారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయిన ఆల్ ఇండియా బీడీ, సిగార్, టొబాకో వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ బీడీ సంక్షేమ శాఖ ద్వారా కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్, ఇంటి నిర్మాణానికి సహాయం అందించాలని కోరారు. ప్రతీ జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్, సంచార వైద్యశాల మంజూరు చేయాలన్నారు. ఈపీఎఫ్‌వో ద్వారా కనీస పెన్షన్ ఆరు వేల రూపాయలు, దేశవ్యాప్తంగా వెయ్యి బీడీలకు 300 రూపాయలు వేతనం, ప్రతీనెల బీడీ కార్మికులకు బ్యాంక్ ద్వారా కాకుండా నేరుగా వేతనం చెల్లించాలని కోరారు. నెలలో 26 రోజులు పని ఉండేలా చూడాలని నాణ్యమైన తునికాకు, తాంబాకు కార్మికులకు సరిపడా వేయాలన్నారు. ఈపీఎఫ్‌వోలో ఆధార్‌తో సంబంధం లేకుండా క్లెయిమ్‌లను స్వీకరించాలన్నారు. బీడీ రంగంలోని అన్ని రకాల సమస్యలపై భవిష్యత్తు పోరాటాలు చేయాలని కార్మికులకు సూచించారు. డిసెంబరు నెలలో సేవ్ ఇండియా-సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలో ఢిల్లీ ప్రోగ్రామ్ నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కేంద్ర మంత్రులను కలిసి సమస్యలను వివరిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జాతీయ బీడీ కార్మిక సమాఖ్య నాయకులు నవాబ్, విలాస్, దేవదాస్, రాంబిలస్ శర్మ, నబీందు గారా, శపన్ చందా , కడారి రాములు, అజ్జ వేణు, వడ్డెపెల్లి లక్ష్మణ్, అనసూర్య, రైసుద్దీన్, అసద్ జమాల్ కదేరి, యునస్, సుతారీ రాములు, ఆది రంగారెడ్డి, ముక్రమ్, గోవర్ధన్, లక్ష్మణ్. భానుచందర్, శాంత, గాజుల లింగం, కొక్కుల శాంతా, పండుగ పోచమల్లు, మోహినొద్దీన్, న్యాలపల్లి భారతి, సగున షర్మిల పాల్గొన్నారు.

గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ


గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. నట్టి వారోత్సవాలను పురస్కరించుకుని గోదావరి నదికి భారీగా భక్తులు తరలివచ్చి స్నానాలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు డమరకం, త్రిశూలం, ఒగ్గు జోలు చేత పట్టుకుని బయలు దేరారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదెల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

ఎంపీలు బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ప్రశ్నించాలి


మాట్లాడుతున్న బీసీ సాధికారత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్

వేములవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు ప్రశ్నిస్తూ పట్టుబట్టాలని, పార్లమెంట్‌ను స్తంభింపజేయాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పిస్తూ రాష్ట్ర ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. కేంద్రానికి పంపి తొమ్మిది నెలలు గడిచినా నెలలుగా ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ జేఏసీ నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాన మంత్రిని, రాష్ట్రపతిని కల్పించి బీసీ బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. లేనిపక్షంలో అసెంబ్లీని, పార్లమెంటును, ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నేతలు ఇల్లందుల వెంకటేష్, ఉయ్యాల భూమయ్య, చింతలకోటి రామస్వామి, వానంపెల్లి దేవయ్య, ప్రభాకర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాకారులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో ఆదివారం 8వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలను విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. పోటీలు డిసెంబరు 2వ తేదీ వరకు జరగనున్నాయి. క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యఅతిథులకు స్వాగతం పలుకుతూ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి ఆది శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి ఒలింపిక్, వాలీబాల్ అసోసియేషన్ జెండాలను ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వేదికపై ఉన్న ముఖ్య అతిథులకు 10 జిల్లాల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం సమర్పించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులను పూర్తిచేసుకొని శారీర, మానసిక ఉల్లాసం కోసం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో లాంటి గ్రామీణ క్రీడలను ఆడేవారన్నారు. కపిల్‌దేవ్ హయాంలో ప్రపంచ కప్ సాధించిన అనంతరం క్రికెట్ వంటి క్రీడలపై మొగ్గు చూపిన గ్రామాల్లో యూత్ క్లబ్‌లు, అసోసియేషన్స్ పెద్దల సహకారంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. వేములవాడలో వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలతో పాటు జాతీయ వాలీబాల్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులకు కొదవలేదని మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు ఉన్నారని, వారిని వెలికితీయడానికి క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు.

క్రీడలతో మనోవికాసంతో పాటు శారీరక ధారడ్యం పెంపొందుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వాలీబాల్ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథి ప్రభుత్వ విప్ వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ హన్మంత్‌రెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి గిన్నె లక్ష్మన్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధానకార్యదర్శి ఎ రాందాస్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, రామస్వామి, రెఫరీ బోర్డు రాష్ట్ర చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.




వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, పోటీలో తలపడతున్న బాలికల జట్లు

వేములవాడలో భక్తుల రద్దీ

- ఎల్ఈడీ స్క్రీన్‌పై రాజన్న దర్శనం


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో దాదాపు 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యఅన్నదాన సత్రం పైఅంతస్తులో కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి మహాలింగార్చన, కుంకుమపూజలు, పెద్ద పల్లకీ సేవలు, ఆకుల పూజలు చేసి భక్తిప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామి వారిని ఎల్ఈడీ స్క్రీన్‌పై దర్శించుకున్నారు. క్యూలైన్, తలనీలాలు, అభిషేకాలు తదితర చోట్ల ఈవో రమాదేవి పరిశీలించారు.

● వైభవంగా రుద్రాభిషేకం

గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి 11మంది రుత్వికులతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నాగిరెడ్డి మండపంలో ఏకాంతంగా పరివార దేవతలకు అర్చనలు, గీతా హోమం నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లో అర్చనలు నిర్వహించారు.

● బద్దిపోచమ్మకు బోనాలు

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటలు పట్టింది.

● సిద్దిపేట, జగిత్యాల ఎన్నికల అబ్జర్వర్ల పూజలు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర ఆలయంలో స్వామివారిని సిద్దిపేట ఎన్నికల అబ్జర్వర్ హరిత, జగిత్యాల్ ఎన్నికల అబ్జర్వర్ బి రమేష్ దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మల్లన్న బోనాల జాతర

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామ శివారులోని గుట్టపైన గల మల్లికార్జునస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో జాతర ఘనంగా సాగుతోంది. మండలంలోని గోదూర్ గ్రామానికి చెందిన పలువురు యాదవ కులస్తులు, మహిళలు బోనాలతో మల్లన్న దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేస్తూ, మల్లన్న పాటలను ఆలపిస్తూ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించి, తంతును పూర్తి చేశారు. సాయంత్రం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకుని, తమ కోరికలను వేడుకున్నారు. ఈ వేడుకల్లో యాదవ సభ్యులు, వీడీసీలు, భక్తులు పాల్గొన్నారు.


బోనాలతో బయలుదేరిన భక్తులు

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామం మోహినికుంట లక్ష్మీమల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయంనుబంతి పూలతో అలకరించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్స మార్గశిర బహుల దశమి ఆదివారం ఉదయం 11-59ని.లకు స్వామి వారి కళ్యాణోత్సవంను ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి వేద మంత్రోర్చణల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా పండితులు సంపత్ కుమార్‌శర్మ నిర్వహించినట్లు అలయ వంశపారంపర్య అర్చకులు మూడపల్లి భద్రయ్యశర్మ తెలిపారు. కల్యాణోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చింతపంటి రామస్వామి, పులి సత్తయ్య, శ్రీమన్ నారాయణ, ఏసుదాసు, ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన విద్యార్థి


ప్రాజెక్ట్‌తో విద్యార్థి బండారి రాకేష్

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బండారి రాకేష్ అనే విద్యార్థి ఇన్‌స్పైర్ మనాక్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అందరినీ గుండెపోటు కబలిస్తున్న సందర్భంలో గ్యాస్ట్రిక్, అల్సర్ సంబంధిత సమస్యల లక్షణాలకు, గుండెపోటు లక్షణాలకు ఉన్న కొద్ది పాటు తేడాను గుర్తించకపోవడంవల్ల ఆకస్మిక మరణాలు అరికట్టడానికి పనిచేస్తుంది. ఏ వ్యక్తిలో అయినా హార్ట్ ఎటాక్ కన్నా ఆరు గంటల ముందు నుంచే హార్ట్‌బీట్ అసాధారణ పరిధిని సూచిస్తుంది. ఈ విధానంవల్ల ఐదు, ఆరు గంటల ముందుగా హార్ట్‌బీట్‌లో తేడాను డివైస్ ద్వారా కచ్చితంగా గుర్తించడం ద్వారా సరైన సమయంలో చికిత్స జరిపించి, తక్కువ శ్రమతో ప్రాణాన్ని కాపాడవచ్చని విద్యార్థి బండారి రాకేష్, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు బైరి సౌమ్య సహాయంతో తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థి రాకేష్ ప్రధానోపాధ్యాయురాలు మేకల మాధవీలత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఉమామహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ పీఎంశ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రావణ్‌తేజ, ఆయాన్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం మధుమాలతి ఆదివారం తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

● ఇంటర్వ్యూ

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

- ప్రదీప్‌కుమార్, సీఐ, చొప్పదండి



ఆంధ్రజ్యోతి: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలపై నిఘా పెట్టారా?

సీఐ: అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు తీసుకుంటాం. మద్యం, డబ్బు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తారనే అనుమానమున్న గ్రామాల్లో నిఘా పెట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి భద్రతా చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: చొప్పదండి, రామడుగు, గంగాధర పరిధిలో 72 గ్రామాల్లో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు మండలాల్లో ఎస్సై, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్ల పర్యవేక్షిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఎన్ని సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు

సీఐ: 15 సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. ముందస్తుగా అనుమానితులను బైండోవర్ చేశాం.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు ఇచ్చే సూచనలేమిటి?

సీఐ: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కులు వినియోగించుకోవాలి. డబ్బులు ఇచ్చినా, తీసుకునా కేసులు నమోదవుతాయి. ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, డీజేలకు అనుమతి లేదు.

విద్యార్థికి డీఈవో అభినందన

చొప్పదండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి తరుణ్ కుమార్‌ను జిల్లా విద్యాధికారి మొండయ్య అభినందించారు. రాజస్థాన్ జోద్‌పూర్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి నెట్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్ర బాలుర జట్టులో తరుణ్ కుమార్ ఎంపికయ్యారు. ఎంఈవో మోహన్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జలీల్, పీడీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలువురు వార్డు సభ్యుల ఏకగ్రీవం



నగునూర్‌లో పరిశీలిస్తున్న డీపీవో జగదీష్

కరీంనగర్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పలు మండలాల్లో తొలివిడత నామినేషన్ల పరిశీలన పూర్తయింది. కొన్ని చోట్ల వార్డుస్థానాలకు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమయ్యారు. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామ పంచాయతీలు, 132 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ స్థానాలకు మొత్తం 102, వార్డు స్థానాలకు 359 నామినేషన్లు దాఖలుఅయ్యాయి. ఆదివారం ఉదయం డీపీవో జగదీష్ నామినేషన్లను పరిశీలించారు. 14 గ్రామాల సర్పంచ్ నామినేషన్లకు 68 మంది సర్పంచ్ అభ్యర్థులు ఉన్నారు. 132 వార్డు స్థానాలు ఉండగా 25 ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 107 వార్డులకు 301 మంది వార్డు సభ్యులు ఉన్నట్లు ఏంపీవో జగన్మోహన్ తెలిపారు.

నేడు అప్పీల్, రేపు ఉపసంహరణలు

నామినేషన్ వేసిన అభ్యర్థుల నుంచి అభ్యర్థనలు ఉంటే సోమవారం ఫిర్యాదులు తీసుకోనున్నారు. పరిష్కార అనంతరం మంగళవారం నామినేషన్ల ఉప సంహారణ ఉంటుంది. అనంతరం అభ్యర్థులకు గుర్తులకు కేటాయించనున్నారు.

25 మంది వార్డు సభ్యుల ఏకగ్రీవం

కరీంనగర్ రూరల్ మండలంలో 25 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగుంటపల్లిలో 8 మంది వార్డు సభ్యులు ఉండగా 5 ఏకగ్రీవమయ్యాయి. 2వ వారు వడ్లూరి సతీష్, 3 తమ్మనవేని రవీందర్, 4 బిజ్జగిరి రాజు, 7 కాశిపాక శ్వేత, 8అట్ల మమత. నగునూర్‌లో మొదటి వార్డులో కస్తూరి రాఘవేందర్ రెడ్డి ఏకగ్రీవం అయ్యారు. దుబ్బపల్లిలో మొత్తం 8వార్డులుండగా 2లో దారం నర్సయ్య ఎన్నికయ్యారు. జూబ్లీనగర్ 8వార్డులకు 1వ వార్డులో జటంగి పద్మ, 3 బొద్దుల పద్మ, 6 పూల శంకర్, 7 సంగమల్ల సుధాకర్, 8 కచ్చు రజిత ఎన్నికయ్యారు. తహెర్ కొండాపూర్‌లో మొత్తం 6 వార్డులకు 1లో ఆకుల లావణ్య, 2 ఆకుల శంకరయ్య, 4 చింతల శంకరయ్య, ఫకీర్ పేటలో మొత్తం 8 వార్డులకు 1లో బొద్దుల అనిల్ బావు, 2 ఎలిగేటి సుగసుణ, 4 ఆడపా పద్మ, బహదూర్‌ఖాన్‌పేట 4 గుర్రం లలిత, ఇరుకుల 8కాశిపాక కాంచన, చెర్లబూత్కూర్ 11 మూల స్వర్ణ, మొగ్దుంపూర్ 3 వార్డులో సుంక రమ ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. వీరికి ఎన్నిక పత్రాలను అందజేశారు.

చొప్పదండి : చొప్పదండి మండలంలో నామినేషన్ల పరిశీలన ఆదివారం పూర్తయ్యింది. 16 పంచాయతీలలో సర్పంచ్ స్థానాలకు 80 మంది నామినేషన్లు ఖరారయ్యాయి. ఆదివారం నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత ఆర్నకొండలో 13, మంగళపల్లి 4, రాగంపేట 6, పెద్దకుర్మపల్లి 4, కోనేరుపల్లి 4, గుమ్లాపూర్ 7, చాకుంట 3, కొలిమికుంట 4, సాంబయ్యపల్లి 8, భూపాలపట్నం 4, వెదురుగట్టు 3, చిట్యాలపల్లి 3, రుక్మాపూర్ 3, కాట్నపల్లి 5, రేవెల్లి 8 నామినేషన్లు ఖరాయ్యాయి. దేశాయిపేటలో ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీమైంది. 8 వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలవగా దేశాయిపేట గ్రామ పంచాయతీ మొత్తం ఏకగ్రీమైంది. 16 పంచాయతీలలో వార్డు స్థానాలకు 332 నామినేషన్లు ఖరారయ్యాయి.

● రామడుగు మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 108, వార్డు స్థానాలకు 480 నామినేషన్లు ఖరారయ్యాయి. సర్పంచ్ కొరటపల్లి 4, గోలిరామయ్యపల్లి 9, మోతె 3, గోపాల్‌రావుపేట 7, గుండి 5, కొక్కెరకుంట 5, దేశరాజ్‌పల్లి 3, వన్నారం 3, లక్ష్మీపూర్ 5, వెంకట్రావుపల్లి 3, రామడుగు 7, తిర్మలాపూర్ 4, రాంచంద్రాపూర్ 5, చిప్పకుర్తి 7, షానగర్ 4, కిష్టాపూర్ 4, రుద్రారం 6, రంగసాయిపల్లి 5, దత్తోజిపేట 3, వెదిర 6, వెలిచాల 4, శ్రీరాములపల్లి 2, పందికుంటపల్లి 4 నామినేషన్లు ఖరారయ్యాయి. 222 వార్డులకు 480 నామినేషన్లు ఖరారయ్యాయి.

3 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఇల్లందకుంట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వాధికారులు మూడో దశ ఎన్నికల నామినేషన్లు ఈ నెల 3నుంచి 5వరకు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆయా గ్రామాల క్లస్టర్ పరిధిలో ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగుతుందన్నారు. డిసెంబరు 9న ఉపసంహరణ ఉంటుందని, ఎన్నికలు డిసెంబరు 17న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటాయన్నారు. అదేరోజు సాయంత్రం కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు.

తొలి విడత నామినేషన్ల పరిశీలన పూర్తి

(5వ పేజీ తరువాయి)

పూర్తయ్యింది. దీంతో అభ్యర్థులు నామినేషన్లు వేసిన కొందరిని పోటీ నుంచి ఉపసంహరింప చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల కోసం కొన్ని చోట్ల ఎక్కువ మంది నామినేషన్లు వేయగా, మరికొన్ని చోట్ల ఇద్దరు, ముగ్గురు మాత్రమే బరిలో ఉన్నారు. తక్కువ మంది ఉన్న చోట ఏకగ్రీవం కోసం పోటీదారులను నామినేషన్ల ఉప సంహరణ కోసం బుజ్జగింపులు ప్రారంభమయ్యాయి. నామినేషన్ ఉప సంహరించుకొని మద్దతు ఇవ్వాలంటూ ప్రాధేయపడటం, బుజ్జగించడం వంటి వాటితో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. ఉపసంహరణకు రెండు రోజుల గడువు ఉండడంతో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

ట్రినిటి స్క్రీనింగ్, మెరిట్ టెస్ట్‌కు స్పందన

కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ట్రినిటి ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్క్రీనింగ్ అండ్ మెరిట్ టెస్ట్‌కు స్పందన లభించినట్లు విద్యా సంస్థల ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ట్రినిటి ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారని తెలిపారు. విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

వీణవంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి అన్నారు. మండలంలో స్థానిక ఎన్నికల్లో గ్రామల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధిలో మరింత ముందుకెళ్తోందన్నారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం, బోనస్, రైతులకు రుణామాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు.

అయ్యప్ప ఆలయ ఛైర్మన్‌గా రాజేష్

చొప్పదండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని వేంకటేశ్వర మణికంఠ(అయ్యప్ప) ఆలయ ఛైర్మన్‌గా పొన్నం రాజేష్ ఎన్నికయ్యారు. ఆదివారం అయ్యప్ప ఆలయంలో నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పొన్నం రాజేష్ గెలుపొందారు. ఆలయ గౌరవాధ్యక్షులు వేంసాని రవీందర్ యాదవ్, గొల్లపల్లి శ్రవణ్ కుమార్, నలుమాచు రామకృష్ణ, బొడిగ వెంకటేష్, బొడిగ వెంకన్న, కటకం మల్లికార్జున్, చేపూరి సత్యనారాయణ, పైడ మహేష్, చీకట్ల లచ్చయ్య, కట్ట సత్యనారాయన, మామిడాల నిరంజన్, పోరండ్ల భాస్కర్, ఎన్నం మునీందర్, దండే రవీందర్, దండె సత్యానందం, మరిమడ్ల రాజిరెడ్డి, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ ఖాన్‌పురలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో ఆదివారం కరీంనగర్ సితార హాస్పిటల్ సౌజన్యంతో మహమ్మద్ జాఫర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సితార హాస్పిటల్ ఎండీ డాక్టర్ జాదవ్ రాజ్ కుమార్, డాక్టర్ వెంకట్ భరద్వాజ్ పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సమద్ నవాబ్, ముఫ్తీ మహమ్మద్ అలీమొద్దిన్, కరీం ఖాద్రి, మహమ్మద్ రఫీక్, సయ్యద్ మాజిద్ ఫజల్, ముజీబ్, రమేష్, షెహన్నా, షబానా మహమ్మద్ పాల్గొన్నారు.

68వ సారి రక్తదానం చేసిన రాధాకృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తలకు గాయమై నగరంలోని అపోలో రీచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుడికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి పూట్కూరి రాధాకృష్ణారెడ్డి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 68వ సారి రక్తదానం చేసినట్లు చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రాధాకృష్ణారెడ్డి ముందుంటారన్నారు.

సీపీఐ మద్దతుదారుల గెలుపునకు కృషి చేయాలి

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం అనునిత్యం పనిచేస్తున్న ఎర్ర జెండా గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. గంగాధర మండలం మంగపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎనిమిదో వార్డులో సీపీఐ అభ్యర్థి షేక్ యాకూబ్ ఏకగ్రీవంగా ఎన్నికవడంతో ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ ప్రజాపోరాటంలో ప్రత్యేక ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి షేక్ మౌలానా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఆరు నెలల్లో రాజీనామా చేస్తా

చిగురుమామిడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆరు నెలల్లో రాజీనామా చేస్తానని మండలంలోని బొమ్మనపల్లికి చెందిన కొంకట మౌనిక అనే సర్పంచ్ అభ్యర్థి అన్నారు. ఆదివారం ఆమె నావినేషన్ వేశారు. అంతకు ముందు మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారు. తాను ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో స్వచ్ఛందంగా రాజీనామా చేస్తానన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన అంజన్‌కుమార్

కరీంనగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన వైద్యుల అంజన్‌కుమార్ ఆదివారం మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పలు కుల సంఘాల నాయకులను అంజన్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ఆధ్వర్యంలో అంజన్‌కుమార్‌ను సన్మానించారు. కరీంనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం ఛైర్మన్ యాగండ్ల అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడి పూజకు హాజరయ్యారు. కమాన్ ప్రాంతంలో గోవులకు పూజలు చేశారు.

కోడూరి రవీందర్ స్మారక క్రికెట్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జానపద నృత్య కళాకారుడు కోడూరి రవీందర్‌గౌడ్ స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. కోడూరి రవీందర్ కుమారులు కోడూరి అంబరీష్, ఏపీపీ చంద్ర, గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో గల్లీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను 37వ డివిజన్ యువతకు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ కార్పొరేటర్ వంగల పవన్, రిషి కాన్వెంట్ ఛైర్మన్ చెన్నప్ప, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మహేందర్, జనరల్ సెక్రటరీ మురళీధర్, సీనియర్ క్రీడాకారుడు సుధాకర్, టీఆర్‌వీకేఎస్ ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్, కోడూరి హరికష్ణ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

భగత్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రేకుర్తిలోని 18వ డివిజన్ ధర్మపురి కాలనీ, శాతవాహన కాలనీలో ఆదివారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. జనజాగరణలో భాగంగా ఇంటింటికి వెళ్లి భరత మాత స్టిక్కర్ అతికించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవకులు జాడి బాల్‌రెడ్డి, అన్నాజీ వినీత్, గోదరి నరేష్ పాల్గొన్నారు.

● ప్రధాని మన్‌కీ బాత్ వీక్షణ

ప్రధాని నరేందరమోదీ 128వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని 17వ డివిజన్ విద్యానగర్‌లో బీజేపీ నాయకులు శక్తి కేంద్రం ఇన్‌చార్జి నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వీక్షించారు. పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, కచ్చు మధు, శీతల రమేష్‌చంద్ర, బండ రాకేష్, చంద్రగిరి వేణు, ఈరెడ్డి తిరుమలరెడ్డి, అబ్బిడి మాధవరెడ్డి, బొంగోని పర్శరాములు పాల్గొన్నారు.

విద్యానగర్‌లోని 362 పోలింగ్ బూత్‌లో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు వీక్షించారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుడా ఛైర్మన్ క్యాంపు కార్యాలయం ఏర్పాటు

కరీంనగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఉన్న నగర కాంగ్రెస్ కార్యాలయం కాస్త సుడా ఛైర్మన్ క్యాంపు కార్యాలయంగా మారింది. సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జ్యోతిబాపూలే (సర్కస్) గ్రౌండ్ వెనక నగర కాంగ్రెస్ కార్యాలయం కొనసాగింది. ఇటీవల జిల్లా, నగర అధ్యక్షులు మారడంతో తాను ఏర్పాటు చేసుకున్న నగరకాంగ్రెస్ కార్యాలయాన్ని సుడా ఛైర్మన్ క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నారు. సుడా అధికారిక కార్యాలయం జిల్లాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్నా పార్టీ కార్యకర్తలను, నాయకులను కలవడానికి సెలవు దినాల్లో అందరికీ అందుబాటులో ఉండడానికి క్యాంపు కార్యాలయాన్ని వినియోగించుకోనున్నారు. పార్టీ కార్యాక్రమాలను క్యాంపు కార్యాలయం నుంచే కొనసాగించనున్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ కార్యాలయానికి అవకాశం ఉన్నా నగరంలోని కార్యకర్తలు, నాయకులకు 24 గంటలు అందుబాటులో ఉండేందుకు నరేందర్‌రెడ్డి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే కార్యకర్తలు, నాయకులను కలిసేవారు. మీడియా సమావేశాలను ఇక్కడి నుంచే ప్రారంభిచేవారు.



సుడా ఛైర్మన్ క్యాంపు కార్యాలయం

కరీంనగర్‌కు చేరుకున్న మహాపాదయాత్ర బృందం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత నెల 12న నాగరాజు గురుస్వామి నేతృత్వంలో కరీంనగర్ అయ్యప్ప దేవాలయం నుంచి శబరిమలైకి బయల్దేరిన మహాపాదయాత్ర బృందం ఆదివారం కరీంనగర్ చేరుకుంది. భగత్ నగర్ అయ్యప్ప ఆలయంలో బృందం పూజలు చేయగా స్థానికులు, కుటుంబ సభ్యులు, ఆలయ ఛైర్మన్ అనిల్‌కుమార్ గౌడ్ స్వాగతం పలికారు. అయ్యప్ప దయతో యాత్ర విజయవంతంగా ముగిసిందని నాగరాజు పేర్కొన్నారు. డి.సంపత్, హరీశ్, బిట్టు, దిలీప్, గురవయ్య పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్‌లో తల్లిదండ్రులకు ఆటల పోటీలు

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ)పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ రోజువారి కార్యక్రమాల నుంచి ఉపశమనం పొందేలా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. ప్రిన్సిపాల్ ప్రియదర్శిని పాల్గొన్నారు.



ఆటలపోటీల్లో పాల్గొన్న తల్లిదండ్రులు

ఎస్సై అమ్జద్‌కు పదవీవిరమణ వీడ్కోలు



సయ్యద్ అమ్జద్‌ను సన్మానిస్తున్న సీఐ

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సయ్యద్ అమ్జద్ పదవీ విరమణ సందర్భంగా ఆదివారం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీడ్కోలు పలికారు. 42 ఏళ్లగా పోలీస్ శాఖలో పని చేసిన ఆయన విరమణ పొందుతున్న సందర్భంగా ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్జద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుల్‌లు, మహిళా కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సుభాష్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని సన్ షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మానేరు వాకర్స్ అసోసియేషన్, వెంకటేశ్వర కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించినదని ఆస్పత్రి సీఈవో డాక్టర్ టి.సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర కాలనీలోని సిద్ధార్థ హైస్కూలులో నిర్వహించిన గుండె, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, యూరాలజీ, ఆర్థో, వెన్నుముక వైద్యులు సేవలు అందించారు. ఈ సందర్భంగా సీఈవో డాక్టర్ తాటిపాముల సురేష్ మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తరువాత ఇబ్బంది పడేకంటే, ముందుగా గుర్తిస్తే జాగ్రత్తలతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. శిబిరంలో గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ వినోద్ కుమార్, మెదడు, వెన్నెముక నిపుణుడు డాక్టర్ రాజేష్, మూత్రపిండ వైద్య నిపుణుడు దీపక్ కస్తూరి, డాక్టర్ దివ్యరెడ్డి బద్దం, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రామ్మోహన్, ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఉజ్వల్ తేజ్, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ సాయికృష్ణ, సిద్ధార్థ పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అయేషా, మానేరు వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భూపతి ఆనందం, అధ్యక్షుడు రేవోజు కనకాచారి, ప్రధాన కార్యదర్శి ముస్కుల విద్యాసాగర్ రెడ్డి, వెంకటేశ్వరకాలనీ అధ్యక్షుడు గంగడి దేవేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

ఘనంగా బాలోత్సవ్-2025

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లంబోదర కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో కళా అశోక్ లాస్య నేతృత్వంలో బాలోత్సవ్-2025 పిల్లల పండుగ ఘనంగా నిర్వహించారు. వివేకానంద విద్యాసంస్థల ఛైర్మన్ సౌగాని కొమురయ్య వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి కళలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. బాల కళాకారులు ప్రతిభ కనబరిచి సత్తా చాటుతున్నారన్నారు. అనంతరం జాతీయ స్థాయి డాక్టర్ అబ్దుల్ కలాం, బాల రత్న, నంది అవార్డులను అందజేశారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇల్లందకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం సిరిసేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజు, చిరంజీవి, దేవదాసు, రాజు, దేవేందర్‌రెడ్డి, కమలాకర్, ప్రవీణ్, పావని, విజయ, ఇంద్ర, స్వప్న, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఓపెన్ జూనియర్ చెస్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. నగరంలోని భగత్‌నగర్‌లోని చైతన్య యూత్ క్లబ్‌లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ టోర్నమెంట్‌ను మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ మేధాశక్తిని పెంచుతుందన్నారు. వేద భవన్, బాల కుటీర ఎల్లలకు అనూప్ ఉచితంగా చెస్ నేర్పించడం అభినందనీయమన్నారు. జీనియస్ చెస్ అకాడమి ఛైర్మన్ కనకయ్య, చైతన్య క్లబ్ నిర్వాహకులు ధోలి ఉపేంద్రనాథ్, బొంతల ప్రవీణ్ కుమార్, వర్దినేని వెంకట్రావు, పండుగ నాగరాజు, బత్తిని మధు, నూనె సాయికృష్ణ, డైరెక్టర్ అనూప్ కుమార్, కో-ఆర్డినేటర్ సృజన్ కుమార్, అకాడమీ కోచ్‌లు అభిరామ్, రేవిక్, అరుణ్ ప్రభు, శ్రీనిజ, స్వాతి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



హుజూరాబాద్‌లో పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం పరకాల క్రాస్ రోడ్‌లోని వాసవి ఇండస్ట్రీస్, ఎంఆర్ఎంలో ఆదివారం అయ్యప్పస్వామి మహా దివ్య పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రైస్‌మిల్లు వ్యాపారి కాళ్ల బసవన్న, కాళ్ల సంతోష్, అనిమ దంపతులు రైస్‌మిల్లులో సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. గురుస్వాములు కల్లూరు వెంకట్రావు, దొరై రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. హుజూరాబాద్ శివరామ కృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భజన కీర్తనలు నిర్వహించారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని అయ్యప్పస్వామి మాల ధరించిన సుమారు 500మంది స్వాములు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు

సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ చంద్రశేఖర్ రెడ్డి

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఆదివారం నామినేషన్లు స్వీకరించారు. తిమ్మాపూర్ మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 212 వార్డులకు సంబంధించి 30 సర్పంచ్, 45 మంది వార్డు దాఖలు చేశారు. తిమ్మాపూర్ సర్పంచ్ 2, వార్డు 6, మహాత్మానగర్ సర్పంచ్ 1, వార్డు 4, కొత్తపల్లి సర్పంచ్ 2, వార్డు 3, రేణికుంట సర్పంచ్ 1, వారు 3, నల్లగొండ సర్పంచ్ 2, వార్డు 3, మక్తపల్లి సర్పంచ్ 2, వార్డు 4, నుస్తులాపూర్ సర్పంచ్ 1, వార్డు 1, రామకృష్ణ కాలనీ సర్పంచ్ 3, వార్డు 3. ఇందిరానగర్ సర్పంచ్ 1, పోరండ్ల సర్పంచ్ 1, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ 1, గొల్లపల్లి సర్పంచ్ 2, వార్డు 1, వచ్చునూర్ సర్పంచ్ 2, వార్డు 1, రాంహనుమన్ నగర్ సర్పంచ్ 3, వార్డు 1, జుగుండ్ల సర్పంచ్ 2, పర్లపల్లి వార్డు 3, మొగిళిపాలెం వార్డు 3, పొలంపల్లి సర్పంచ్ 1, వార్డు 3, నర్సింగ పూర్ సర్పంచ్ 3, వార్డు 5, మల్లాపూర్ వార్డు ఒకటి చొప్పున నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర తెలిపారు.

శంకరపట్నంలో..

శంకరపట్నం: శంకరపట్నం మండలంలో 27 గ్రామపంచాయతీలకు 240 వార్డులు ఉన్నాయి. మొదటిరోజు సర్పంచ్‌కు సంబంధించి ఏడు క్లస్టర్లలో 35మంది, వార్డులకు సంబంధించి 50మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 5 క్లస్టర్ కేంద్రాల్లో అదివారం 16 సర్పంచ్‌లకు, 32 వార్డు సభ్యులకు నామినేషన్ల్ ధాఖాలైనట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు.

గన్నేరువరం : మండలంలోని 17 గ్రామాల్లోని సర్పంచ్ స్థానాలకు, 140 వార్డు స్థానాలకు గన్నేరువరం, ఖాసింపేట, హన్మాజిపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు 10 సర్పంచ్ స్థానాలకు, 17 వార్డు స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గన్నేరువరంలో సర్పంచ్‌కు 1, వార్డు 1, గునుకుల కొండాపూర్‌లో సర్పంచ్‌కు 2, వార్డు 3, గుండ్లపల్లి ఎక్స్ రోడ్‌లో సర్పంచ్ 2, వార్డు 2, చీమలకుంటపల్లి సర్పంచ్ 2, వార్డుకు 2, జంగపల్లి సర్పంచ్‌కు 1, వార్డు 1, మైలారం వార్డు 2, ఖాసింపేట సర్పంచ్ 1, వార్డు 5, మాధాపూర్‌లో సర్పంచ్ 1, వార్డు ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎస్సై నరేందర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్: మానకొండూర్ మొదటి రోజు సర్పంచ్ 30, వార్డులకు 65 నామినేషన్లు దాఖలయ్యాయి. గట్టుదుద్దెనపల్లి కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ పరిశీలించారు. అన్నారంలో వార్డు సభ్యులకు 2, లలితాపూర్ వార్డు 1, చెంజర్ల వార్డు 10, దేవంపల్లిలో సర్పంచ్ 2, వార్డు 5, కెల్లేడు సర్పంచ్‌కు 1, పోచంపల్లిలో సర్పంచ్ 2, వార్డు 2, గంగిపల్లి సర్పంచ్ 1, వార్డు 1, గట్టుదుద్దెనపల్లి వార్డు 1, శంషాబాద్ సర్పంచ్ 1, వార్డు 3, లింగాపూర్ వార్డు 3, శ్రీనివాస్‌నగర్ సర్పంచ్ 2, వార్డు 3, జగ్గయ్యపల్లి సర్పంచ్ 1, కొండపల్కల సర్పంచ్ 1, బంజేరుపల్లి సర్పంచ్ 1, వార్డు 1, మానకొండూర్ సర్పంచ్ 2, వార్డు 8, ఖాదర్‌గూడెం సర్పంచ్ 1, వార్డు 1, ముంజంపల్లి సర్పంచ్ 3, ఈదులగట్టెపల్లి సర్పంచ్ 2, వార్డు 3, పచ్చునూర్ సర్పంచ్ 2, వార్డు 5, మద్దికుంట సర్పంచ్ 2, వార్డు 2, వేగురుపల్లి సర్పంచ్ 2, వార్డు 3, వెల్ది సర్పంచ్ 1, రంగపేట సర్పంచ్ 2, వార్డు 5, లక్ష్మీపూర్‌లో సర్పంచ్‌కు 1, వార్డులకు 6 నామినేషన్లు దాఖలు చేశారు.